సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 16 । జూలై । 2025



పాఠశాలల్లో ఇంటర్‌నెట్!

జిల్లాలోని 148 ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించేందుకు విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 10లో



గురుకులాలు.. హౌస్‌ఫుల్!

ప్రభుత్వ సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలకు ఏటేటా పోటీ పెరుగుతోంది. దీంతో అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 33°/ 25°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

సింగరేణి మహిళా కళాశాలలో తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న ప్రొఫెసర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలను కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు మంగళవారం తనిఖీ చేశారు. కాలేజీలో నూతనంగా ప్రవేశపెట్టిన బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుకు సంబంధించి మౌలిక సదుపాయాలు, లైబ్రరీ, ప్రయోగశాలలు, తరగతి గదులు, ఇతర వనరులు ఉన్నాయా, అధ్యాపకులు సరిపడా ఉన్నారా అనే వివరాలను కేయూకు చెందిన ప్రొఫెసర్లు పి.వరలక్ష్మి, నరసింహాచారి, జి. హనుమంతరావు అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలు, వనరులపై వారు సంతృప్తి వ్యక్తం చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద తెలిపారు.

నేడు స్మారక స్తూపాల ఆవిష్కరణ



ఇల్లెందు: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యాన ఇల్లెందులో నిర్మించిన అమర వీరుల స్మారక స్తూపాలను బుధవారం ఆవిష్కరించనున్నారు. గతంలో ప్రజాపంథాగా ఉన్నప్పుడు పార్టీ నిర్మాణం, పటిష్టతకు కృషి చేసిన చంద్ర కృష్ణమూర్తి(ఎల్లన్న), గండి యాదన్న, రాయల చంద్రశేఖర్ స్మారక స్తూపాలను నిర్మించారు. వీటిని నేడు ఆవిష్కరించాక ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ సభ విజయవంతానికి కొద్దిరోజులుగా విస్తృత ప్రచారం చేస్తున్నారు. కాగా, బుధవారం జరిగే సభలో మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్, రాష్ట్ర కార్యదర్శి పి.రంగారావు, నాయకులు చంద్ర అరుణ, కే.జీ.రాంచందర్, కె.రంగయ్య, కె.రమ, గుమ్మడి నర్సయ్య, ముద్దా భిక్షం, నాయిని రాజు, ఈసం శంకర్, రాయల విమల తదితరులు పాల్గొననున్నారు.

ఆ ఐదింటి సంగతేంటి?



ఏపీలో కలిసిన యటపాక గ్రామం

విలీన గ్రామాలపై దృష్టి పెట్టాలని వేడుకోలు

- తిరిగి తెలంగాణాలో కలపాలని స్థానికుల డిమాండ్
- సమస్యలు పట్టించుకోవడం లేదంటూ ఆందోళన
- నేటి సీఎంల భేటీలో చర్చించాలని విన్నపాలు



తెలంగాణలో కలపాలంటూ భద్రాచలం ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న విలీన గ్రామాల ప్రజలు (ఫైల్)

భద్రాచలం: ఏపీలో విలీనమైన ఐదు గ్రామపంచాయతీల సమస్య మరింతగా ముదురుతోంది. పోలవరం ముంపు పేరుతో అన్యాయంగా తమను ఏపీలో కలిపారని ఆయా గ్రామాల వారు భగ్గుమంటున్నారు. ఆ పంచాయతీలను విడదీసి భద్రాచలం పట్టణాన్ని ముక్కలు చేశారంటూ భద్రాద్రి వాసులూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కేంద్ర జల మండలి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు భేటీ కానున్న నేపథ్యంలో ఈ ఐదు గ్రామాలపై చర్చించాలని అందరూ వేడుకుంటున్నారు.

సమస్యపై పట్టింపేది..

ఏపీలో విలీనమైన యటపాక, గుండాల, పురుషోత్తపట్నం, పిచుకలపాడు, కన్నాయిగూడెం గ్రామాలు భద్రాచలం మండల పరిధిలో ఉండేవి. 2011 జనాభా లెక్కల ప్రకారం కన్నాయిగూడెంలో 2,161, పిచుకలపాడులో 2,187, గుండాలలో 3,816, పురుషోత్తపట్నంలో 1,372, యటపాకలో 2,410.. మొత్తం 11,946 జనాభా ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 25 వేలు దాటుతుందని అంచనా. ఇక భద్రాచలంలో నాడు 40 వేల మంది ఉండగా ఇప్పుడు సుమారు లక్ష వరకు ఉండొచ్చని అధికారులు అంటున్నారు. పట్టణానికి మూడు వైపులా సరిహద్దులుగా ఆ ఐదు పంచాయతీలు ఉండేవి. ఇవి లేని భద్రాచలం పట్టణాన్ని ఊహించలేమని స్థానికులు చెబుతుంటారు. కానీ రాష్ట్ర విభజన సమయంలో రాత్రికి రాత్రే రాజ్యాంగ సవరణ ద్వారా పోలవరం ముంపు పేరుతో ఈ పంచాయతీలను ఏపీలో విలీనం చేశారు. అయితే తమను తిరిగి తెలంగాణలో కలపాలంటూ దశాబ్దకాలంగా ఆయా గ్రామాలతో పాటు భద్రాచలం వాసులు కూడా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఇక్కడి నుంచి పోటీచేసిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల సమయంలో ఈ మేరకు హామీలు గుప్పించినా.. సమస్యను ఢిల్లీ స్థాయికి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

నేటి భేటీలో చర్చించండి..

గోదావరి – బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో బుధవారం భేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న ఐదు పంచాయతీల సమస్యను చర్చించాలని, ఈ గ్రామాలను తిరిగి తెలంగాణలో కలిపేలా కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు, భద్రాద్రి వాసులు కోరుతున్నారు. ఇరువురు సీఎంలు సానుకూలంగా స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.

ఎందుకు కలపాలంటున్నారంటే..

- ఈ ఐదు పంచాయతీల్లో ప్రధానంగా పురుషోత్తపట్నం, గుండాల, యటపాక గ్రామాలు నేటికీ భౌగోళికంగా భద్రాచలంలో అంతర్భాగంగా ఉన్నాయి.
- తొలిసారి రాష్ట్ర విభజన గెజిట్‌లో వీటి విలీన అంశం లేదు. ఆ తర్వాత చేసిన రివైజ్డ్ గెజిట్‌తో ఈ గ్రామాలను ఏపీలో విలీనం చేశారు.
- ఈ ఐదు పంచాయతీలను రంపచోడవరం రెవెన్యూ డివిజన్‌లో, అల్లూరి సీతారామరాజు జిల్లాలో చేర్చారు. అయితే జిల్లా కేంద్రమైన పాడేరు వెళ్లాలంటే సుమారు 380 కి.మీ. అలాగే రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రంపచోడవరం 120 కి.మీ.దూరంలో ఉంటుంది. అదే తెలంగాణలో కలిపితే డివిజన్ కేంద్రమైన భద్రాచలం 5 కిలోమీటర్లు, జిల్లా కేంద్రమైన కొత్తగూడెం కేవలం 40 కిలోమీటర్ల దూరంలోనే ఉంటాయి.
- ఈ పంచాయితీల పరిధిలోని ప్రజలు విద్య, వైద్యం, ఇతర అవసరాల కోసం అంత దూరం వెళ్లాల్సి వస్తోంది. ఇక పదో తరగతి పూర్తయిన విద్యార్థులు కనీసం ఇంటర్ చదవాలన్నా చింతూరు వరకు వెళ్లాల్సి ఉంటుంది.
- ఈ ఐదు గ్రామాలకు పోలవరం ముంపుతో సంబంధం లేదని, అయినా ముంపు పేరుతో ఏపీలో కలిపారని ఆయా గ్రామాల వారు అంటున్నారు.
- ప్రధానంగా గతంలో యటపాక నుంచి భద్రాచలంలోని కాలనీలను కలుపుతూ నెల్లిపాక వరకు కరకట్ట నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. ఇందులో ఉమ్మడి ఏపీలో యటపాక నుంచి భద్రాచలంలోని సుభాష్‌నగర్ కాలనీ వరకు నిర్మాణం పూర్తి చేశారు. 2022లో గోదావరి వరదలకు యటపాక కరకట్టపైకి నీరు చేరింది. ప్రస్తుతం ఏపీలో కలిసిన గుండాల, యటపాక వరకు కరకట్ట నిర్మించకపోతే భవిష్యత్‌లో బాధలు రెట్టింపవుతాయి.
- భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ భూములు సుమారు 900 ఎకరాలు పురుషోత్తపట్నంలో ఉన్నాయి. అంతర్రాష్ట్ర సమస్య కావడంతో దీనిపై దేవస్థానం అధికారులు – పురుషోత్తపట్నం రైతులకు మధ్య నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయి.
- ఈ సమస్యపై గతంలో ఐటీడీఏ పీఓగా పనిచేసిన దివ్య సైతం ప్రభుత్వానికి నివేదిక అందజేశారని, దాన్నైనా ప్రాతిపదికగా తీసుకుని తిరిగి తెలంగాణలో కలపాలని ఆయా గ్రామాల వారు కోరుతున్నారు.

కలెక్టర్‌కు జాతీయ అవార్డు



బ్లడ్ గ్రూప్ వివరాలను తీసుకుంటున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

రేపు అందుకోనున్న పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు నేషనల్ జియో స్పెషియల్ ప్రాక్టిషనర్ అవార్డు లభించింది. ఈనెల 17న ఐఐటీ బాంబేలో జరుగనున్న ఓపెన్ సోర్స్ జీఐఎస్ డేలో ఐఎస్ఆర్ఓ మాజీ చైర్మన్ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోనున్నారు. దేశంలోనే తొలిసారి జిల్లాలో ఓపెన్ సోర్స్ జీఐఎస్(జియోగ్రాఫికల్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్) ఏర్పాటు చేసి గ్రామీణ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ విశేషంగా కృషి చేయడంతో కలెక్టర్‌ను ఈఅవార్డు వరించింది. ఈ ప్రాజెక్టులో తొలి అడుగుగా కలెక్టర్ చొరవతో ఐఐటీ బాంబే ఆధ్వర్యంలో ఈ ఏడాది మే 6, 7 తేదీల్లో పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో సదస్సు నిర్వహించారు. జిల్లాలోని అగ్రికల్చర్, మైనింగ్, ఇంజనీరింగ్ విద్యార్థులు హాజరు కాగా క్యూజీఐఎస్(క్వాంటం జియోగ్రాఫికల్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్) ద్వారా గ్రామీణ సమస్యల పరిష్కారానికి జియో స్పేషియల్ డేటాను ఎలా వినియోగించాలో ప్రాక్టికల్‌గా చూపించారు. గోదావరి వరదల సమయంలో నీటిస్థాయిని బట్టి ముంపు గ్రామాలను ముందుగానే గుర్తించి హెచ్చరికలు జారీ చేయడం, వివిధ పీహెచ్‌సీ, సబ్ సెంటర్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను జీఐఎస్ ద్వారా మ్యాప్ చేసి విద్యార్థుల ఆరోగ్యంపై డాక్టర్లను అప్రమత్తం చేయడం వంటి వాటికి ఉపయోగపడుతుందని వివరించారు. ఇలాంటి సాఫ్ట్‌వేర్‌ను గ్రామీణ ప్రాంతాలకు సైతం అందుబాటులోకి తెచ్చేలా కలెక్టర్ కృషి చేయడంతో ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

రక్తదానం చేయండి.. జీవితాలు కాపాడండి

కొత్తగూడెంఅర్బన్: యువత రక్తదానం చేసి పలువురి జీవితాలను కాపాడాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. ఇండియన్ యూత్ సెక్యూర్డ్ ఆర్గనైజేషన్ సౌజన్యంతో స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన రక్త పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రక్త పరీక్షలతో బ్లడ్ గ్రూప్ తెలుసుకోవడం సులభమని, అత్యవసర సమయాల్లో రక్తదానం చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కేంద్రంలో తాను కూడా రక్త పరీక్ష చేయించుకున్నానని, అవసరమైతే రక్తదానానికీ సిద్ధమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీఓ వెంకటరమణ, మనోహర్, వెంకటపుల్లయ్య, డీఎస్పీ రెహమాన్, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భారజల కర్మాగారం సందర్శన

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం సందర్శించారు. పరిపాలన విభాగం కార్యాలయంలో జీఎం శ్రీనివాసరావు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భారజలం ఉత్పత్తి అయ్యాక వెలువడే నీటి వ్యర్థాలను తాగునీటిగా మార్చే అంశంపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలేష్, డీఈ బ్రహ్మదేవ్, భారజల కర్మాగారం అధికారులు పాల్గొన్నారు.

మంత్రుల సభ ఏర్పాట్ల పరిశీలన

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం జరిగే సభలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క, రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అదనపు కలెక్టర్ విద్యాచందన మంగళవారం పరిశీలించారు. సుమారు 5 వేల మంది పాల్గొంటున్న ఈ సభలో వడ్డీలేని రుణాలు రూ.5.7 కోట్లు, ఏప్రిల్ నుంచి జూలై వరకు బ్యాంకు లింకేజీ రుణాలు రూ.30 కోట్లు, ప్రమాద బీమా, లోన్ బీమా రూ.15 లక్షలకు సంబంధించిన చెక్కులు పంపిణీ చేయనున్నారు. సభలో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు పాల్గొననున్నారు.

అధికారులతో సమీక్ష

ఇల్లెందురూరల్/టేకులపల్లి: ఇల్లెందులో జరిగే మంత్రుల పర్యటన, సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇల్లెందు, టేకులపల్లి మండలాల సెర్ప్ అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో అదనపు కలెక్టర్ విద్యాచందన సమీక్ష నిర్వహించారు. ముందుగా రొంపేడు అటవీ ప్రాంతంలో వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారని, ఆ వెంటనే మహిళా శక్తి సంఘాల లబ్ధిదారులతో బహిరంగ సభ ద్వారా సమావేశమవుతారని వివరించారు. సభ మధ్యాహ్నం 12 గంటలకే ప్రారంభమయ్యే అవకాశం ఉందని, ఆలోపు మహిళలు సభా ప్రాంగణానికి వచ్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, డీపీఎం సమ్మక్క, ఏపీఎంలు దుర్గారావు, రవికుమార్, ఏపీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, టేకులపల్లి మండలం సులానగర్ పీహెచ్‌సీలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. రక్తహీనత గురించి మహిళలకు వివరించారు. ఆకుకూరలు ఎక్కువగా తినాలని, మునగాకు, కరివేపాకు, బెల్లంతో తయారు చేసిన రాగి లడ్డు, నువ్వుల లడ్డు, పల్లి చెక్క రోజువారీగా తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారి కంచర్ల వెంకటేశ్, ఆయుష్ వైద్యాధికారి విజయశ్రీ, డీపీఎం సమ్మక్క, ఉద్యోగులు రవికుమార్, సునీల్‌కుమార్, నాగేశ్వరరావు, వజ్జా పార్వతి, దేవా, కౌసల్యసింగ్, రాజు పాల్గొన్నారు.



ఇల్లెందురూరల్: సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

కార్డియాలజిస్ట్ నియామకం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కార్డియాలజిస్ట్‌గా డాక్టర్ సీతారాం డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తించారు. ఆయన డిప్యూటేషన్ గడువు గత నెలలో ముగియగా చికిత్సలు నిలిచిపోయాయి. దీంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచి గుండె సంబంధిత సమస్యలతో వచ్చే వారికి ఇబ్బందులు ఎదురుకాగా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చేది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా మళ్లీ సీతారాంను డిప్యూటేషన్‌పై తీసుకోవాలని నిర్ణయించగా తిరిగి సేవలు అందుబాటులోకి వచ్చాయి.

అసాంఘిక శక్తులపై పటిష్ట నిఘా

ఎస్పీ రోహిత్‌రాజు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. ప్రతీ కేసులో సమగ్ర విచారణ నిర్వహించి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలన్నారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మంగళవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బాధితులకు న్యాయం చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలతో నిరంతరం రోడ్లపై తిరుగుతూ ఉండాలని, గంజాయి, మత్తు పదార్థాలు తరలించే వారిపై నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో హాట్‌స్పాట్ ప్రాంతాలను గుర్తించాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాలను అమర్చాలని, వ్యాపార సముదాయాలు, ఇళ్లలో కూడా ఏర్పాటుచేసేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి కేసులను సత్వరమే పరిష్కరించాలని, చోరీకి గురైన సొత్తును రికవరీ చేయాలని అన్నారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం జోనల్ స్థాయిలో పతకాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, సతీష్‌కుమార్, రవీందర్‌రెడ్డి చంద్రభాను, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొండరెడ్ల సంక్షేమానికి ప్రణాళిక

ఐటీడీఏ పీఓ రాహుల్ వెల్లడి



ఉట్నూరు ఐటీడీఏ బృందంతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: మారుమూల ప్రాంతాల్లో నివసించే కొండరెడ్ల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు ఐటీడీఏ పీఓ బి. రాహుల్ తెలిపారు. అదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన తెగల అధ్యయన బృందం మంగళవారం భద్రాచలం వచ్చింది. ఈ సందర్భంగా రాహుల్‌ను కలిసిన సభ్యులు.. ఉట్నూరు ఏజెన్సీలో నివసిస్తున్న కొలమ్ గిరిజన తెగకు సంబంధించిన గ్రామాలు, ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం పీఓ రాహుల్ మాట్లాడుతూ.. తాము గిరిజనులకు విద్య, వైద్యం కోసం మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. గిరిజన రైతులకు కరెంటు మోటార్లు, ఆయిల్‌పామ్ సాగుతో పాటు పలు రంగాల్లో శిక్షణ అందిస్తున్నామని వివరించారు. కొండరెడ్లు, కోయ, లంబాడా, నాయక్‌పోడు గిరిజన తెగల గోత్రాలు, వారి ఇలవేల్పులకు సంబంధించిన అంశాలను స్టోరీల రూపంగా బుక్‌లెట్ ముద్రించి ఆగస్టు 9న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, పీవీటీజీ అధికారి రాజారావు, అధ్యయనం బృందం సభ్యులు ఆత్రం ముకుందరావు, కుడిమేత తిరుపతి, మర్సుకోల బాబూరావు, ఏకం వసంతరావు, సిడం భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ బీమా కార్డులు..

గిరిజనులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధార్తీ ఆభాజాన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ శ్యాచురేషన్, పీఎం జన్మన్ కార్డులు పంపిణీకి చర్యలు తీసుకుంటామని రాహుల్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌నుంచి గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ శరత్ వీసీ నిర్వహించగా జిల్లా నుంచి రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద 10,290 మందికి బీమా కార్డులు అందజేశామని, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలకు 114 మెడికల్ కిట్లు అందించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. కాగా, అడిషనల్ డీఎంహెచ్ఓగా నియమితులైన బి.సైదులు పీఓ రాహుల్, ఎమ్మెల్యే వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన..



ఆశ్రమ పాఠశాల విద్యార్థినులతో టేబుల్ టెన్నిస్ ఆడుతున్న పీఓ

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను పీఓ రాహుల్ మంగళవారం సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి భవిష్యత్‌లో ఎలాంటి లక్ష్యాలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. తాను ఐఏఎస్ కావాలనుకుంటున్నానని ఆరోతరగతి విద్యార్థిని వెంకటరమణి చెప్పగా, ఆ బాలికకు పెన్ను ఇచ్చి ప్రోత్సహించారు. అనంతరం టేబుల్ టెన్నిస్ ఇండోర్ గేమ్‌ను ప్రారంభించి విద్యార్థినులతో కలిసి టేబుల్ టెన్నిస్ ఆడారు. పిల్లల్లో నైపుణ్యత పెంపొందించేలా డిబేట్, వ్యాసరచన, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్, కుట్లు, అల్లికల కార్యక్రమాలను ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థినులు టీవీ కావాలని కోరగా వారం రోజుల్లో సమకూరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి గోపాల్‌రావు, హెచ్ఎం బానోత్ సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ముందడుగు..

- రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా 11 పీఏసీఎస్‌లు
- స్టేషనరీ, కార్యాలయాల నిర్వహణకు నిధులు విడుదల
- ఒక్కో ఎఫ్‌పీఓకు రూ 3.16 లక్షలు..
- మంత్రి తుమ్మల చేతుల మీదుగా చెక్కుల పంపిణీ



మంత్రి తుమ్మల చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న బూర్గంపాడు పీఏసీఎస్ చైర్మన్, సీఈఓ

బూర్గంపాడు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఎఫ్‌పీఓ(రైతు ఉత్పత్తిదారుల సంస్థ)గా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన ప్రక్రియలో ముందడుగు పడింది. జిల్లాలో 11 పీఏసీఎస్‌లను తొలి విడతలో ఎఫ్‌పీఓలుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. తద్వారా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతోపాటు తక్కువ ధరల్లో ఇన్‌పుట్ సబ్సిడీ పొందడం, రైతుల ఆదాయం పెంచుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎఫ్‌పీఓలను ఏర్పాటుచేశాయి. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణకు ఈ ఎఫ్‌పీఓలు ఉపయోగపడతాయి. ఎఫ్‌పీఓల్లో సభ్యులైన రైతులకు రుణాలు, ఇతర ఆర్థిక సాయం కూడా అందనున్నాయి.

రైతుల అభివృద్ధే ధ్యేయంగా..

ఎఫ్‌పీఓల్లో కనీసం 150 మంది రైతులు సభ్యులుగా చేరి వాటా ధనం చెల్లించాలి. వీరికి ప్రభుత్వం రూ.15 లక్షల వరకు ఆర్థికసాయం అందిస్తుంది. ఈ నగదుతో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడంతో పాటు తక్కువ ధరలకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేసుకోవచ్చు. వీటి ద్వారా వచ్చిన ఆదాయం కూడా ఆ రైతులకే అందుతుంది. ఈ ఆదాయంతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, విత్తనోత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేసుకుని తమ పరిధిని మరింతగా విస్తరించుకోవచ్చు. ఎఫ్‌పీఓల్లో రైతులు చెల్లించిన వాటాకు ప్రభుత్వం ఈక్విటీ గ్రాంట్ అందిస్తుంది. ప్రాజెక్ట్ రుణాలకు రూ.2 కోట్ల వరకు క్రెడిట్ గ్యారంటీ సౌకర్యం కల్పిస్తుంది. ఇలా రైతుల ఆర్థిక సామర్థ్యాలు బలోపేతమయ్యే అవకాశం ఉంటుంది. జిల్లాలో ఐదు నెలల క్రితం ఎఫ్‌పీఓల ప్రక్రియ ప్రారంభమైంది. కొన్ని పీఏసీఎస్‌లలో రైతులు తమ వాటాధనం చెల్లించి ఎఫ్‌పీఓలలో చేరారు. ఈ సంస్థలకు అవసరమైన స్టేషనరీ, ఫర్నిచర్ కొనుగోలుకు రూ 3.16 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా, హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎఫ్‌పీఓలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెక్కులు అందజేశారు. జిల్లా నుంచి ఎంపికైన పీఏసీఎస్ చైర్మన్లు, సెక్రటరీలు ఈ చెక్కులు అందుకున్నారు.

క్లుప్తంగా

మంచి అలవాట్లు ఉండాలి



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి అలవాట్లతో మెలగాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలోని శిక్షణ కేంద్రం జరిగిన జిల్లాస్థాయి కామిక్ రచన పోటీల్లో విజేతలను మంగళవారం ప్రకటించారు. జిల్లాస్థాయి ప్రథమ బహుమతి టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.తేజస్వి, ద్వితీయ స్థానాన్ని అన్నపురెడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విశ్వతేజ్, తృతీయ బహుమతి పాపకొల్లు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన జి.నితిష్య సాధించారు. పాల్వంచ కేజీబీవీకి చెందిన టి.రూప, టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.హర్షిత ప్రోత్సాహక బహుమతులు పొందారు. వీరికి జిల్లా నాగరాజశేఖర్ బహుమతులు ప్రదానం చేసి, మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే దురలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్కే సైదులు, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్.సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

20న ఉమ్మడి జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపిక

కొత్తగూడెంఅర్బన్: ఉత్తరప్రదేశ్‌లో వచ్చే నెల 6 నుంచి జరగనున్న జాతీయ సబ్ జూనియర్స్ బాలురు, బాలికల బాక్సింగ్ టోర్నీలో పాల్గొనేందుకు రాష్ట్రస్థాయి జట్లను ఎంపిక చేయనున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ ఎర్రా కామేశ్ మంగళవారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో సబ్ జూనియర్స్ జట్ల ఎంపికకు తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఏర్పాట్లు చేస్తోందని, ఈ నెల 20న కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 78936 69676, 98854 42131, 99490 83202 నంబర్లలో సంప్రదించాలని కామేశ్ కోరారు.

మావోలకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు



దుమ్ముగూడెం: మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన వాల్‌పోస్టర్

దుమ్ముగూడెం/కరకగూడెం/పినపాక/కొత్తగూడెంటౌన్: దుమ్ముగూడెం, కరకగూడెం, పినపాక మండలాల్లోని పలు గ్రామాలతో పాటు కొత్తగూడెంలోని రామవరం తదితర ప్రాంతాల్లో 'మావోయిస్ట్ ఆత్మపరిరక్షణ ప్రజా ఫ్రంట్' పేరుతో మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు వెలిశాయి. అందులో మీ సిద్ధాంతాలతో ప్రజలకు లాభం జరగలేదని, 40 ఏళ్ల నాటి ఉద్యమం ప్రస్తుతం ప్రజాదరణకు నోచుకోవడం లేదని, ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిసి, తమ మేధస్సును ప్రజల కోసం ఉపయోగించాలని రాసి ఉంది.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య



దుర్గాభవాని (ఫైల్)

సత్తుపల్లిటౌన్: కడుపునొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. సత్తుపల్లి మండలం సిద్ధారానికి చెందిన గోళ్లపూడి గోపి, కాకర్లపల్లికి చెందిన దుర్గాభవాని(30) 2018లో ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే, గర్భసంచి సమస్యతో బాధపడుతున్న ఆమె సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉన్న మాత్రలను అధిక మోతాదులో మింగింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. దుర్గాభవాని దంపతులకు ఇద్దరు పిల్లలు ఉండగా, కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్‌కుమార్ తెలిపారు.

వెండి, బంగారు ఆభరణాలు చోరీ

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెంలో ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు వెండి, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన తూరపాటి వెంకన్న సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయాన గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలకొట్టి బీరువాలో దాచిన 40తులాల వెండి, ఆరు గ్రాముల బంగారపు ఆభరణాలను చోరీ చేశారు. సాయంత్రం ఇంటికి వచ్చాక చోరీ జరిగిందని గుర్తించిన వెంకన్న మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

పాఠశాలల్లో ఇంటర్‌నెట్!



కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో నేలపై పెట్టిన కంప్యూటర్లు

- జిల్లాలో 148 పాఠశాలలు ఎంపిక
- కంప్యూటర్లు, ఫర్నిచర్ లేక అవస్థలు
- పాఠశాలల్లో బోధకులు లేని వైనం
- ఫలితంగా అంతంతా మాత్రంగానే డిజిటల్ బోధన

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా విద్య, బోధన, భవనాలు, సౌకర్యాలు ఇలా అన్నీ దశలవారీగా ఏర్పాటు అవుతున్నాయి. ఈ క్రమంలో పాఠశాలల్లో అడ్మిషన్లు కూడా అదేస్థాయిలో పెరుగుతున్నాయి. కానీ, విద్యాశాఖ ఉన్నత అధికారులు, మండలస్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం కనిపిస్తోందనే ఆరోపణలున్నాయి. పర్యవేక్షణ పూర్తిస్థాయిలో ఉంటే కార్పొరేట్, ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మారే అవకాశం ఉంది. గతంలో ఉపాధ్యాయుల పనితీరుకు గ్రేడింగ్ ఇచ్చే ఆలోచన చేయగా.. ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమాలకు తెరలేపడంతో అధికారులు వెనక్కి తగ్గారు. గ్రేడింగ్ ప్రక్రియ ఉంటే పోటీతత్వం పెరిగి బోధనలో మార్పులు వచ్చే అవకాశం ఉండేదని పలువురు చెబుతున్నారు. అలాంటి మంచి కార్యక్రమాన్ని ఉపాధ్యాయ సంఘాలు అడ్డుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో విద్యారంగానికి అనేక సంక్షేమ పథకాలు, నిధులు విడుదల చేస్తున్న క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు నష్టపోయే పరిస్థితి ఎదురవుతోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2012–13లో కంప్యూటర్ విద్య నేర్పించేందుకు ప్రత్యేక ఫ్యాకల్టీ ఏర్పాటు చేసి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. 129 పాఠశాలల్లో 812 కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. మరుసటి ఏడాది అవి దెబ్బతినడంతో బోధన, కంప్యూటర్లను అటకెక్కించారు. ఆ తరువాత 2016–17లో 49 పాఠశాలలకు కంప్యూటర్లు మరమ్మతులు చేయించేందుకు రూ.2 వేల చొప్పున విడుదల చేయగా.. అవి సరిపోక కంప్యూటర్లు అలాగే ఉండిపోయాయి. అనంతరం జిల్లాలోని కొన్ని పాఠశాలలకు కంప్యూటర్లు నేరుగా రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం నుంచే మంజూరు చేస్తున్నారని, దీంతో ఏఏ పాఠశాలల్లో ఎన్ని కంప్యూటర్లు ఉన్నాయనే వివరాలపై స్పష్టత లేదని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

పాఠశాలలకు నెట్ సౌకర్యం..

పాఠశాలల్లో గతంలో కంప్యూటర్లకు నెట్ సౌకర్యం లేక, బోధకులు లేక మరుగునపడ్డాయి. ఈ క్రమంలో ప్రస్తుతం కంప్యూటర్లు ఉన్న పాఠశాలల్లో నెట్ సౌకర్యం కల్పించేందుకు గానూ రాష్ట్ర విద్యాశాఖాధికారులు జిల్లాలో 148 పాఠశాలలను ఎంపిక చేసి ఆయా పాఠశాలల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించేందుకు గానూ బీఎస్ఎన్ఎల్ బాధ్యులతో చర్చలు జరుపుతున్నారు. చర్చలు సఫలీకృతం అయితే 148 పాఠశాలలకు ఇంటర్‌నెట్ సౌకర్యం రానుంది. వీటిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు కూడా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని కూలీలైన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎంపిక జాబితాలో ఉంది. కానీ, అక్కడ ఒక్క కంప్యూటర్ కూడా లేకపోవడం గమనార్హం. అక్కడే ఉన్న ఉన్నత పాఠశాలలో కంప్యూటర్లు ఉన్నప్పటికీ ఫర్నిచర్ లేక కిందనే భద్రపరిచారు. చాలా పాఠశాలల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఉన్న కంప్యూటర్లకు మరమ్మతులు చేయిస్తే స్వచ్ఛంద సంస్థల వారు బోధకులను ఏర్పాటు చేసి కంప్యూటర్ విద్యను అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. గతంలో నవభారత్ ఒకేషనల్ ఇన్‌స్టిట్యూట్ సంస్థ కంప్యూటర్ బోధకులకు వేతనాలు చెల్లించి, పాఠశాలలకు పంపించింది.

డిజిటల్ బోధన కూడా అంతంతే..!

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ బోధన చేసే ఉద్దేశంతో మొత్తం 270 పాఠశాలలను ఎంపిక చేసి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ)లను తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు. ప్యానళ్లు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో 80 శాతం వరకు సాధారణ బోధన, 20శాతం వరకు డిజిటల్ బోధన నడుస్తోంది. ప్యానల్స్ ఏర్పాటు చేసిన చోట ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ప్యానళ్లకు నెట్‌కావాలంటే సెల్‌ఫోన్ల ద్వారా కనెక్షన్ ఇచ్చి డిజిటల్ బోధన చేస్తున్నారు. అయితే, తరగతి గదుల్లో సెల్‌ఫోన్లు వినియోగించకూడదనే నిబంధన అడ్డువస్తోంది.

జిల్లాలో 148 పాఠశాలల ఎంపిక



ఇంటర్‌నెట్ సౌకర్యం కోసం జిల్లాలో 148 పాఠశాలలను రాష్ట్ర విద్యాశాఖాధికారులు ఎంపిక చేశారు. బీఎస్ఎన్ఎల్ నెట్‌ను ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. దీంతో విద్యార్థులకు మెరుగైన బోధన అందనుంది.

– ఎం.వెంకటేశ్వరాచారి, డీఈఓ



బోర్డు చాటు తెర..

ఆ పాఠశాలలోని తరగతి గదిలో ఓ వినూత్న ప్రయోగం చేశారు. స్లైడింగ్ బోర్డు ఏర్పాటు చేశారు. ముందు ఆకుపచ్చ రంగులో ఉన్న బోర్డు కనిపిస్తుంది. దానిని పక్కకు జరిపితే లోపల డిజిటల్ తెర (టీవీ) కనిపిస్తుంది. అవసరమైనప్పుడు బోర్డుపై పాఠాలు బోధిస్తారు. లేదా బోర్డును జరిపి డిజిటల్ క్లాసులు చెబుతారు. ఇలా సాంకేతికత తరగతి గదుల్లోకి చొచ్చుకురావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ స్లైడింగ్ బోరుకరకగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో ఉంది.

–కరకగూడెం

'ప్రభుత్వాల విధానాలతో కార్మికుల శ్రమ దోపిడీ'

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించడమే కాక పాలకులు ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలతో కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్.పద్మ పేర్కొన్నారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన టీయూసీఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికుల పరిస్థితి దిగజారేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వం వేతనాలు పెంచకపోగా, ప్రస్తుత ప్రభుత్వం పని గంటలు పెంచి కార్మికులపై భారం పెంచిందన్నారు. సమావేశంలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి జి.రామయ్య, అధ్యక్షుడు ఎ.వెంకన్న, నాయకులు కొయ్యల శ్రీనివాస్, సీ.వై.పుల్లయ్య, వెలదండి బాబు, ఆవుల అశోక్, శరత్, ఎస్.కే.లాల్‌మియా, గోసు పుల్లయ్య పాల్గొన్నారు.

గురుకులాలు హౌస్‌ఫుల్!



చుంచుపల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు

ప్రవేశాలకు విద్యార్థులు, తల్లిదండ్రుల ఆసక్తి

- ఎస్సీ, బీసీ గురుకులాల్లో 90శాతానికి పైగా సీట్లు భర్తీ
- మిగిలిన సీట్ల కోసం పోటాపోటీగా పైరవీలు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంక్షేమ గురుకులాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు గురి కుదురుతోంది. ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల గురుకులాల్లో ప్రవేశాలకు ఏటా పోటీ పెరుగుతుండడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో సీట్లకు సరిపడా విద్యార్థులు మాత్రమే ప్రవేశపరీక్ష రాయడంతో దాదాపు అందరికీ సీట్లు వచ్చేవి. కానీ రెండు, మూడేళ్లుగా పరీక్ష రాస్తున్న విద్యార్థుల సంఖ్య పెరగడంతో పోటీ పెరిగింది. ఒక్కో గురుకులంలో వందల సంఖ్యలో ఉన్న సీట్లకు వేల సంఖ్యలో విద్యార్థులు పోటీ పడుతుండడం విశేషం. ఉమ్మడి జిల్లాలో ఎస్సీ, బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యాన గురుకులాలు కొనసాగుతుండగా, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల గురుకులాల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రధానంగా బీసీ గురుకులాల్లో గత ఏడాది 2వేల మేర సీట్లు ఖాళీగా మిగిలితే ఈసారి సీట్లన్నీ భర్తీ అవుతుండడంపై అధికారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

పెరుగుతున్న ఆదరణ

సంక్షేమ శాఖల పరిధిలోని గురుకులాల్లో చేరేందుకు గతంలో విద్యార్థులు అంతగా ఆసక్తి చూపించలేదు. అయితే, నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తుండడంతో ఏటేటా పోటీ పెరుగుతోంది. గురుకులాల్లో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు కార్పొరేట్ స్థాయి బోధన అందుతోంది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, లెక్చరర్లు బోధిస్తుండగా, చదువుతోనే సరిపెట్టకుండా విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంపైనా దృష్టి సారిస్తున్నారు. క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తుండడంతో విద్యార్థులు పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. వసతి విషయానికి వస్తే బెడ్ల నుంచి ఆహారం వరకు నాణ్యతగా ఉండం.. సన్నబియ్యంతో భోజనమే కాక మటన్, చికెన్, గుడ్లు, పాలు అందిస్తున్నారు. బాలికలు, బాలురకు వేర్వేరుగా విద్యనందించేలా ఏర్పాట్లు ఉండడంతో విద్యార్థినుల నుంచి కూడా ఆదరణ పెరుగుతోంది.



రఘునాథపాలెం బీసీ గురుకుల కళాశాల తరగతి గదిలో విద్యార్థినులు

సీట్ల కోసం పైరవీలు..

గురుకులాల్లో ప్రవేశానికి వేల మంది ప్రవేశ పరీక్ష రాస్తున్నారు. అయితే, కొందరికి సీట్లు రాకపోగా, సీట్లు వచ్చినా పలువురు వివిధ కారణాలతో చేరడం లేదు. దీంతో బ్యాక్‌లాగ్ సీట్లలో చేరేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. ఈక్రమంలోనే ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల ద్వారా పిల్లలకు సీట్లు ఇప్పించాలని తల్లిదండ్రులు సంక్షేమ శాఖల అధికారులకు చెప్పిస్తున్నారు. ఇంకొందరు ఓ అడుగు ముందుకేసి లేఖలతో సంక్షేమ శాఖల కా ర్యాలయాల చుట్టూ తిరుగుతుండడం గురుకులా లకు పెరిగిన ఆదరణకు నిదర్శనంగా నిలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో బీసీ, ఎస్సీ గురుకులాలు, సీట్లు

బీసీ గురుకులాలు

జిల్లా	పాఠశాలలు	కళాశాలలు	మొత్తం సీట్లు	నిండినవి
ఖమ్మం	13	13	8,674	8,370
భద్రాద్రి	11	10	6,880	6,450

ఎస్సీ గురుకులాలు

జిల్లా	పాఠశాలలు	కళాశాలలు	మొత్తం సీట్లు	నిండినవి
ఖమ్మం	11	11	7,040	6,564
భద్రాద్రి	07	07	4,480	4,190

మెరుగైన ఉత్తీర్ణత



మునుపెన్నడూ లేనివిధంగా ఈ విద్యాసంవత్సరం బీసీ గురుకులాల్లో చేరేందుకు విద్యార్థుల్లో ఆసక్తి పెరిగింది. గత ఏడాది పదో తరగతి, ఇంటర్‌లో మెరుగైన ఉత్తీర్ణత నమోదు కావడమే కాక పలువురు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. గురుకులాల్లో మెరుగైన విద్యతో పాటు మంచి సౌకర్యాలు ఉండడం విద్యార్థుల సంఖ్య పెరగడానికి కారణంగా భావిస్తున్నాం.

– సీహెచ్.రాంబాబు, ఆర్‌సీఓ, బీసీ గురుకులాలు

వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు ప్రాధాన్యత

ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ విద్యుత్ సర్వీసుల జారీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఖమ్మం ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సర్వీసుల మంజూరీ 14 శాతం పెరిగిందని వెల్లడించారు. 2023 జూలై 15నుంచి 2025 జూలై 14 వరకు 3,875 వ్యవసాయ సర్వీసులు మంజూరీ చేయగా, 2024 జూలై 15 నుంచి 2025 జూలై 14 వరకు 4,018 సర్వీసులు మంజూరు చేశామని తెలిపారు. అలాగే, పొలంబాటలో భాగంగా వంగిన స్తంభాలు, లూజ్ లైన్లను గుర్తించి సరిచేస్తున్నామని, ఇందులో భాగంగా1,937 లైన్లను సరిచేయడమేకాక అవసరమైన చోట 2,013 స్తంభాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపునకు వాహనాలను ఏర్పాటు చేశామని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే పట్టణాల్లో 24 గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లోగా కొత్తవి అమరుస్తున్నామని ఎస్‌ఈ వెల్లడించారు.

కొత్తలింగాలలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం

కామేపల్లి/కారేపల్లి: కామేపల్లి మండలం కొత్తలింగాల సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రాన్ని ఎస్‌ఈ శ్రీనివాసాచారి భూమి పూజ చేశారు. ఈ కేంద్రం ద్వారా కామేపల్లి, కారేపల్లి, రఘునాథపాలెం, ఏన్కూరు మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే సత్వర మరమ్మతుకు అవకాశం ఉంటుందని తెలిపారు.



కామేపల్లి : ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రానికి భూమి పూజ చేస్తున్న ఎస్‌ఈ శ్రీనివాసాచారి

లాభాల పంట.. ఆయిల్‌పామ్

తల్లాడ: రైతులు ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు గడించొచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఎం.వీ.మధుసూధన్ తెలిపారు. తల్లాడ మండలం తెలగారంలో మంగళవారం పలువురు రైతులు ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతుండగా మధుసూదన్ పరిశీలించి మాట్లాడారు. ఆయిల్‌పామ్ ఒకసారి నాటితే 30ఏళ్ల వరకు ఆదాయం వస్తుందని, ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల బెడద ఉండని తెలిపారు. అంతేకాక ప్రభుత్వం రాయితీపై మొక్కలు ఇస్తూనే నిర్వహణ ఖర్చులు కూడా చెల్లిస్తున్నందున రైతులు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉద్యాన అధికారి నగేష్, ఏఓ ఎం.డీ.తాజుద్దీన్, ఆయిల్‌ఫెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి



మృతిచెందిన గేదె

అశ్వారావుపేటరూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు పాడి గేదెలు మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామ రైతు మురళీకి చెందిన పాడి గేదెలు ఉదయం మేతకోసం ఆసుపాక రోడ్డు వైపు వెళ్లాయి. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. కాగా, అటువైపుగా వెళ్లిన స్థానికులు గేదెలు మృతి చెంది ఉండటాన్ని గమనించి రైతుకు సమాచారం అందించారు. గేదెల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

సెల్ టవర్‌ను దహనం చేసిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి మావోయిస్టులు సెల్‌టవర్‌కు నిప్పంటించి దహనం చేశారు. ఈ ఘటన నారాయణపూర్ జిల్లాలో గల చోటేడోంగేర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చోటేడోంగేర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల మద్నార్‌లోని టవర్‌కు మావోయిస్టులు సోమవారం అర్ధరాత్రి నిప్పంటించారు. సమాచారం అందుకున్న చోటేడోంగేర్ పోలీసులు ఘటనా ప్రాంతంలో వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట స్థావరంపై దాడి

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని చినరాయిగూడెం రోడ్డు సమీపంలోని అడవుల్లో పేకాట ఆడుతున్న వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. రాయి గూ డెం సమీపంలో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ రమాకాంత్ దాడి చేశారు. 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.40,350 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఆటోస్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. నేలకొండపల్లి మండలం అజయ్‌తండాకు చెందిన గుగులోతు సైదులు(37) మంగళవారం ఖమ్మం రాగా, జిల్లా ఆస్పత్రి ఎదుట రోడ్డు దాటే క్రమాన వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

పల్టీ కొట్టిన కారు: తప్పిన ప్రమాదం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం గొల్లగూడెం రోడ్డులో రెండు కార్లు ఢీకొనగా, ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఖమ్మంకు చెందిన సుధాకర్ మంగళవా రం తన కుటుంబ సభ్యులతో కారులో వెళ్తుండగా వెనక నుండి మరో కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో సుధాకర్ కారు బోల్తా పడగా అందులో ఉన్న వారు స్వ ల్ప గాయాలతో బయటపడ్డారు. ఆ సమయాన వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. ఈ ఘటనలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా ఖమ్మం అర్బన్ పోలీసులు చేరుకుని రాకపోకలను క్రమబద్ధీకరించారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పినపాక: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని గోపాలరావుపేటలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సాంబశివరావు ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పినపాక ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వంద పడకల ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం

పాల్వంచరూరల్: మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జగన్నాథపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగన్నాథపురానికి చెందిన, కూలీ పనులు చేసుకునే భూక్యా బాహుసింగ్ (35) మంగళవారం గ్రామ శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని మామిడి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ సుధాకర్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య సుశీల, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దుమ్ముగూడెం: మండలంలోని మంగవాయిబాడవ గ్రామానికి చెందిన కల్లూరి వీరభద్రం (45) శ్రీనగర్‌కాలనీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందాడు. వీరభద్రం ట్రాక్టర్‌పై శ్రీనగర్‌కాలనీ నుంచి మంగవాయిబాడవ వెళ్తుండగా టైరు గుంతలో పడటంతో ట్రాక్టర్ పక్కకు వరిగింది. వీరభద్రం కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. ఆయన్ను భద్రాచలం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచి, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు.

ఇసుక లారీ పట్టివేత

బూర్గంపాడు: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీని జింకలగూడెం గ్రామం వద్ద మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఇసుక రవాణాకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవటంతో పోలీసులు లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కేసు నమోదు

ఇల్లెందు: కరెంట్ ఆఫీస్ ప్రాంతంలో ఓ మటన్ షాపులో 15 ఏళ్ల లోపు బాలుడిని పనికి పెట్టుకున్న యజమానిని గుర్తించిన ముస్కాన్ టీం కేసు నమోదు చేసింది. బుధవారం లేబర్ ఆఫీసర్ శాస్త్రీ, ఎస్‌ఐ సూర్య ఆధ్వర్యంలో కరెంట్ ఆఫీస్ సెంటర్‌లో తనిఖీలు చేయగా మటన్ షాపు యజమాని నిస్సార్ అహ్మద్.. ఓ బాలుడిని 60 రోజులుగా తన షాపులో పనికి పెట్టుకున్నట్లు తేలటంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సూర్య కేసు నమోదు చేశారు.